క్లుప్తంగా

నేడు పెదపట్నంలో గడప గడపకూ

మామిడికుదురు: పెదపట్నంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము బుధవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



వెంకట్రావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ భవాని

అంబాజీపేట: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ యానం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిరతపూడి శివారు ఎస్ఎస్ నగర్‌కు చెందిన నెల్లి వెంకట్రావుకు వలంటీర్ బొంతు దుర్గానర్సభవానీ వెళ్లి వృద్ధాప్య పింఛను బుధవారం పంపిణీ చేశారు. వలంటీర్‌ను సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఘనంగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో బుధవారం స్వామివారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు. ఆలయ అవరణలో ఏడు శనివారాల నోము అచరించిన భక్తులు ఏడు శనివారాలు స్వామి వారి దర్శించుకుని అనంతరం తమ మొక్కులు చెల్లించుకునేందుకు అష్టోత్తర పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాతిబుజ్జి

ఆత్రేయపురం: గ్రామాల్లో జరిగే నాడు–నేడు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నాతిబుజ్జి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అన్ని కాంపోనెంట్స్ పనులు సోమ, గురువారాల్లో ఫోటో క్యాప్చర్ చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్లు ఎలక్ట్రిఫికేషన్ వంటి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.అనందరాజు, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు డి.వీరభద్రరావు, వి.వెంకటరెడ్డి, ఎంఈవో వరప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత శిక్షణా శిబిరాలు



అంబాజీపేటలో మాట్లాడుతున్న హనుమంతరావు

అంబాజీపేట: వేసవిలో నిర్వహించే చదువు, క్రీడలకు సంబంధించిన ఉచిత శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి బిరా హనుమంతరావు కోరారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం హెచ్ఎం హనుమంతరావు మాట్లాడుతూ 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని మండల పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి, అశ్వా చైర్మన్ కామిశెట్టి శ్రీనివాస్ (మధు), బొక్కా అర్జునరావు, బొంతు రమేష్, జె.సతీష్, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులకు టీకాలు వేసినట్టు వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలానాయుడు తెలిపారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ఇంజక్షన్లు వేశారు.

వర్షం.. తీరని నష్టం

- ముంచెత్తుతున్న వానలు
- తడిసిముద్దయిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

ఆలమూరు: అల్ప పీడన ద్రోణి వల్ల గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు రైతాంగాన్ని నట్టేట ముంచాయి. పంట చేతికి అంది వచ్చిన సమాయనికి ప్రకృతి కన్నెర చేయడంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఇప్పటికే ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల కొత్తపేట. పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని సుమారు 40 వేల ఎకరాల్లోని వరి పంటకు సంబంధించి ధాన్యపు రాశుల్లో నీరు చేరి తడిసి ముద్దవ్వగా ఏపుగా పెరిగిన వరిచేలు నీట మునిగాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుందామంటే వరుణుడు ఆ అవకాశాన్ని రైతులకు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారుల బృందం వర్షాల వల్ల తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతన్నలకు కొండంత ధైర్యం వచ్చింది.

నేలపాలైన పంటలు

కొత్తపేట: వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు తీరని కష్టం మిగుల్చుతున్నాయి. ఆరుగాలం పండించి పంటలు నేలపాలయ్యాయి. దీంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కురుస్తున్న వర్షాలకు పొలాల్లో పంట నేలకొరిగింది. మెషీన్‌పై కోత కోసిన ధాన్యం కళ్లాల్లో ఆరబెడుతున్న తరుణంగా మళ్లీ మళ్లీ వర్షం పడుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒబ్బిడి చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఇప్పటికే మండలంలో 30 శాతం మేర విస్తర్ణంలో కోతలు పూర్తయ్యాయి. అకాల వర్షాలతో ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజన్‌లో ఆర్‌డీఓ ఎం.ముక్కంటితో పాటు తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏఓలు ఆయకట్టుల్లో ధాన్యం రాశుల పరిస్థితిని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.



ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

మామిడికుదురు మండలంలో..

మామిడికుదురు: రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న అకాల వర్షం మళ్లీ రైతులకు కడగండ్లను మిగిల్చింది. బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షానికి మామిడికుదురు, నగరం, మొగలికుదురు, గెద్దాడ, పాశర్లపూడి తదితర గ్రామాల్లో రబీ పంట ముంపుబారిన పడింది. పనలపై ఉన్న పంటను భారీ వర్షం ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో మంగళవారం వారం రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ కురిసిన అకాల వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. అకాల వర్షంతో చేల గట్లపై ఆరబెట్టిన పంట మొత్తం మళ్లీ ముంపు బారిన పడింది. ఈ నేపథ్యంలో తడిసిన పంటను సంరక్షించుకునేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల సూచించారు. ఆమె మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి జాగ్రత్తలను వివరించారు.

వరుణుడి దోబూచులాట

అంబాజీపేట: వరుణుడు రైతులతో దోబూచులాడుతూ పరుగులు పెట్టిస్తున్నాడు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ వచ్చింది ఆరుబయట బరకాలు ఏర్పాటు చేసి ధాన్యం ఆరబెట్టిన కొద్ది నిమషాలకే ఆకాశం మేఘా వృతమై వర్షం ఆకస్మికంగా వర్షం కురుస్తుంది. దాంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్, వారపు సంతలలో జనజీవనం స్తంభించింది. చిరు వ్యాపారులు సైతం నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మామిడికుదురు మండలం నగరంలో వర్షం నీటిలో ఉన్న వరి పనలు



పెదపళ్లలో ఈదురు గాలులు, వర్షాలకు నేలకొరిగిన వరిచేలు



నర్శిపూడిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

> **ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు**
>
> 
>
> అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో ఆరిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి, మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నాం. ఆ మేరకు సంచులు, వాహనాలు సరఫరా చేస్తున్నాం. రైతులు విక్రయించేందుకు సిద్ధం చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించాం. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇంకా కోతలు కోయని రైతులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలి.
>
> – ఎం ముక్కంటి, ఆర్‌డీఓ, కొత్తపేట

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆ సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామన్నారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కొర్లపాటి కోటబాబు, వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, బొంతు శ్రీను, నందెపు సూరిబాబు, విత్తనాల శేఖర్, కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రివెట్‌మెంట్ పనులపై కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది నుంచి టేకిశెట్టిపాలెం వరకూ రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి విస్తరణ పనులను బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. ఇందులో భాగంగా కేశవదాసుపాలెం సరిహద్దులో అంతర్వేది ఛానల్‌కు చేస్తున్న రివెట్‌మెంట్ పనులపై ఆయన కాంట్రాక్టర్‌తో చర్చించారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఎమ్మెల్యే కృషి ఫలితమే

- ప్రభుత్వ ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్ కితాబు

కొత్తపేట: కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితమేనని ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్లానింగ్ సెక్రటరీ జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు. బుధవారం అమలాపురం వచ్చిన ఆయన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిశారు. ఆర్‌డీఓ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేశారు అని ఎమ్మెల్యేని అడిగారు. నియోజకవర్గ హెడ్ క్వార్టర్ కొత్తపేటలో ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేశామని ఆయన బదులిచ్చారు. ఈ సందర్భంగా సెక్రటరీ విజయకుమార్ ఆర్‌డీఓ ఆఫీస్‌ను సందర్శించారు. ఆయనను జగ్గిరెడ్డి బొకే, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులతో విజయకుమార్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ డివిజన్ రావడానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పట్టుదలే కారణమన్నారు. ఆయన కృషి ఫలితంగా వచ్చిందని తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ మీ సహకారం కూడా తోడ్పడిందని విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విజయకుమార్‌ను ఆర్‌డీఓ ఎం.ముక్కంటి శాలువాతో సత్కరించారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మాజీ సర్పంచ్ కొల్లి శ్యామ్‌సన్, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్, వైఎస్సార్ సీపీ నాయకులు బెజవాడ నారాయణరావు, మాగాపు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డీఓ కార్యాలయాన్ని సందర్శించిన ప్రభుత్వ ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- కుందాలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పి.గన్నవరం: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కుందాలపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు పప్పుల రాంబాబు, పినిశెట్టి శ్రీను, పప్పుల కర్ణ, అంద్రోతు వీవీ సత్యనారాయణ, పప్పుల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. జగన్ పాలనలో కలిగిన ప్రయోజనాన్ని కుటుంబాలకు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలను ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని వివరించారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పార్టీ నాయకులు దొమ్మేటి దుర్గారావు, జల్లి శ్రీను, పప్పుల నర్సింహస్వామి, కాసర అప్పన్న, తిక్కిరెడ్డి శ్రీనివాస్, కాసర ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



కుందాలపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పళ్లాలమ్మ జాతర, తీర్థం ఘనంగా నిర్వహించాలి

కొత్తపేట: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోనే ప్రసిద్ధి చెందిన పళ్లాలమ్మ అమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ కమిటీ, దేవస్థానం, పోలీసు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. మండల పరిదిలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ జాతర, తీర్థమహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో బుధవారం రావులపాలెం మండలం గోపాలపురంలో ఉత్సవ పోస్టర్లను జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. గత నెల 7వ తేదీ నుంచి అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం కాగా ఈ నెల 7న చిన్న జాతర, 8న పెద్ద జాతర, 9న తీర్థం ప్రారంభమై వచ్చే నెల 9వ తేదీ వరకూ జరుగుతుందని చైర్మన్ అమ్మన్న వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి తరలివచ్చే భక్తులు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవస్థానం ఈఓ బి.వెంకటేశ్వరరావు, జిల్లా వైఎస్సార్‌సీపీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పార్టీ నాయకులు ఉన్నారు.

రామరాజుకు సత్కారం

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా గుడిమూల వీఆర్వో వి.రామరాజును నియామించారు. పదోన్నతి పొంది తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా వచ్చిన రామరాజుకు బుధవారం తహసీల్దారు వై.రామకుమారి, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్ శాలువాతో సత్కరించారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

హిందూధర్మ ప్రచార రథానికి స్వాగతం

మలికిపురం: పల్లిపాలెం వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్దకు బుధవారం వచ్చిన హిందూధర్మ ప్రచార రథానికి ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానం, సమరసత సేవా ఫౌండేషన్ సహాయ సహకారాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సమితి ఆధ్వర్యానపై ప్రచార రథం చేరింది. గోవింద నామ స్మరణతో స్వామివారిని గ్రామస్తులు కీర్తించారు. రథం వద్ద స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం ధర్మప్రచార బృందం మెంబర్ కె.వెంకట శ్రీనివాసరావు ఆలపించిన అన్నమయ్య స్వరార్చన భక్తులను ఆకట్టుకుంది. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

నేడు నృసింహుని జయంతికి ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో గురువారం నిర్వహించే నృసింహస్వామి జయంతి, స్వామివారి దీక్షా విరమణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో, కల్యాణ వేదిక వద్ద షెడ్డులో చేయనున్న విశేష కార్యక్రమాల గురించి చర్చించారు. షెడ్డులో ఏర్పాటు చేసిన మహాశాంతి హోమం పనులను వారు పరిశీలించారు. ఏప్రిల్ 7, 8 తేదీల్లో భక్తులు 27 రోజుల స్వామివారి దీక్ష చేపట్టిన్నట్టు, నృసింహ జయంతి రోజున దీక్షా విరమణ చేయనున్నట్టు రంగాచార్యులు అన్నారు. వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సదస్యం

ఆత్రేయపురం: ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయంలోని రామ సత్యనారాయ స్వామి, అదే గ్రామంలో ఉన్న ఉమాకమండలేశ్వర స్వామివారి ఆలయల్లో బుధవారం సదస్యం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల వద్ద ఉదయం గ్రామోత్సవం జరిగింది. వేదపండితులు, అర్చకులు వేదపారాయణంతో స్వామివారిని ఆశీర్వచనం కార్యక్రమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించారు. భక్తుల ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో అలయ సిబ్బంది, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈఓ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన నల్లాని చక్రవర్తుల వెంకట రామకృష్ణాచార్యులు, అచ్యుతవేదవల్లి తయారు దంపతులు జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10,116 విరాళం అందించినట్టు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా యాళ్ల

మలికిపురం: కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా యాళ్ల లక్ష్మణరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఆయన సమావేశమై కళాశాల అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని సూచించారు. కాగా 2023 ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని సొసైటీల త్రిసభ్య కమిటీ సభ్యులు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నర్శిపూడి పీఏసీఎస్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఉప సర్పంచ్ చల్లా వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్‌పర్సన్‌గా కడలి వెంకటరమణ, సభ్యులుగా గానుగుల ధనరాజు, బొక్కా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, తడిసిన ధాన్యాన్ని కొనుగులు చేసేలా చర్యలు తీసుకోవాలని నూతన పాలకవర్గాన్ని ఆదేశించారు. పంట నష్ట నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుని రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం త్రిసభ్య కమిటీ సభ్యులను పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు టేకి రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ చల్లా పద్మావతి, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, సీఈఓ గంగరాజు కొండలరావు, దియ్యన పెదకాపు పాల్గొన్నారు.



నర్శిపూడిలో సొసైటీ త్రిసభ్య కమిటీని ఘనంగా సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

వైభవంగా సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపేట: మండల పరిధిలోని బిళ్లకుర్రు శివారు వాకాడవారిపాలెం గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వాకాడ శేషగోవిందరావు (చిన్న) ప్రోత్సాహం, గ్రామస్తుల సహకారంతో పొలంలో ఉన్న అమ్మవారికి నూతన ఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఉదయం వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామ ఆడపడుచులు శిఖరంపై బూరెలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



వాకాడవారిపాలెంలో సత్తెమ్మ అమ్మవారి విగ్రహాన్ని తీసుకువస్తున్న గ్రామస్తులు

రైతులను ఆదుకోవాలి

మామిడికుదురు: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజోలు నియోజకవర్గ జనసేన నేత బొంతు రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన గెద్దాడ గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పర్యటించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని రాజేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.

అయినవిల్లి: అకాల వర్షాల వల్ల రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని లాభసాటి ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జనసేన పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల కోఆర్డినేటర్ కడలి ఈశ్వరీ డిమాండ్ చేశారు. అయినవిల్లి, నేదునూరు గ్రామాల్లోని వరిచేలను పరిశీలించారు. ఆమె వెంట జనసేన పార్టీ నాయకులు మద్దాచంటిబాబు, సలాది బుచ్చిరాజు, పడాల గిరి తదితరులు ఉన్నారు.

మండల పరిషత్ ఆర్చ్ నిర్మాణం పారంభం

కొత్తపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముఖద్వారంలో సుమారు రూ.5 లక్షలతో ఆర్చ్ నిర్మాణ పనులను అముడ చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక పక్క ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరో పక్క నిర్మాణాలు చేపట్టిందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు చేరువచేశారన్నారు. ఈ వ్యవస్థకు రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ఆ నిధులు వెచ్చిస్తున్నారన్నారు. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెన్లు నిర్మాణానికి నోచుకుంటున్నాయన్నారు. ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ సభ్యులు చావలి సుబ్బరాయశాస్త్రి, నేలపూడి భీమరాజు, ముళ్ల జనార్దన్, దూళి సూరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు సలాది మావాజీ, బెజవాడ నారాయణరావు, ఈఈపీఆర్‌డీ సీహెచ్ సత్యకల్యాణి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.